# సాక్షి తిరుపతి

సోమవారం ၊ 18 ၊ సెప్టెంబర్ ၊ 2023






**అత్యాధునికంగా 'వసతి'**

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం వైఎస్ జగన్ సోమవారం ప్రారంభించనున్నారు. - 8లో



**చవితి సందడి**

వినాయక చవితి సందర్భంగా తిరుపతి నగరం కిక్కిరిసింది. పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా మారింది. - 8లో


| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| తిరుపతి | 34 | 25 |
| చిత్తూరు | 33 | 23 |
| తిరుమల | 30 | 21 |
| గూడూరు | 37 | 27 |
| నగరి | 35 | 25 |

## న్యూస్‌రీల్

### ఇంటింటా ఆనందాలు నిండాలి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి



నారాయణస్వామి డిప్యూటీ సీఎం



మంత్రి ఆర్‌కే రోజా



ఎంపీ మిథున్‌రెడ్డి

**పుంగనూరు/తిరుపతి అర్బన్:** జిల్లా ప్రజలకు ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ వేర్వేరు ప్రకటనల్లో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలిగించే గణనాథుని దీవెనలతో ఇంటింటా ఆనందాలు నిండాలని ఆకాంక్షించారు. సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### క్రమశిక్షణతో విధుల నిర్వహణ



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

**తిరుమల :** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో క్రమశిక్షణతో పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం తిరుమల పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసులతో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో పనిచేయడమంటే దేవునికి సేవచేయడమేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పకడ్బందీ భద్రత**

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ భద్రత కల్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు. 18 నుంచి 26వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాల్లో నిత్యం సుమారు లక్ష మంది శ్రీవారిని దర్శించుకోనున్నట్లు వెల్లడించారు. అందులో గరుడసేవ రోజున 4 నుంచి 5 లక్షల మంది తిరుమలకు చేరుకునే అవకాశముందని వివరించారు. ఈక్రమంలో మొత్తం 3,782 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. గరుడసేవ రోజున ద్విచక్రవాహనాలను కొండపైకి అనుమతించమని స్పష్టం చేశారు. తిరుమలలోని 32 ప్రాంతాల్లో 15వేల వాహనాలను పార్క్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

### సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్

**తిరుమల:** తిరుమల శ్రీవారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రానున్నారు. ఆదివారం ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి మామిడికాయల మండీ వద్ద శ్రీనివాస సేతు ప్రారంభించే ప్రాంగణం, తాతయ్యగుంట గంగమ్మ గుడి, అక్కడ నుంచి తిరుమలకు చేరుకుని తిరిగి విమానాశ్రయం వర కు వాహనశ్రేణి ట్రయల్‌రన్ చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీ లు నిర్వహించింది. ట్రయల్ రన్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాల వెలుగులో శ్రీనివాస సేతు (ఇన్‌సెట్) సీఎం వైఎస్ జగన్

# నేడు జిల్లాకు సీఎం రాక

- పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

**తిరుపతి అర్బన్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా తిరుపతిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకోనున్నారు. అనంతరం శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు చేరుకోనున్నారు. ఈ మేరకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. పర్యటన వివరాలు ఇలా..

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు.
- 3.25కి ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 3.50 గంటలకు తిరుచానూరు మార్కెట్ యార్డ్ సమీపంలోని సభా ప్రాంగణానికి విచ్చేస్తారు.
- శ్రీనివాస సేతు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నూతన హాస్టల్ భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.
- టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయింపు పత్రాలను పంపిణీ చేసి 4.20 గంటలకు బయలుదేరుతారు.
- 4.30 గంటలకు గంగమ్మను దర్శించుకుంటారు.
- 4.55కు బయలుదేరి, 5.40 గంటలకు తిరుమలకు చేరుకుని వకుళమాత అతిథిగృహం, అనంతరం 5.55కి రచన గెస్ట్‌హౌస్ ప్రారంభిస్తారు.
- 6.10గంటలకు శ్రీ పద్మావతి అతిథి గృహానికి చేరుకుని 7.40 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు.
- అనంతరం రాత్రి 7.45 బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంటారు.
- 7.55 నుంచి 9.10 వరకు శ్రీవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ క్యాలెండర్-2024 ఆవిష్కరిస్తారు. పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు.
- 9.15 గంటలకు శ్రీపద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు.
- మంగళవారం ఉదయం 6.10 గంటలకు శ్రీపద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరి 6.20 గంటలకు శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు. స్వామివారి దర్శనానంతరం 6.50 గంటలకు పద్మావతి అతిథి గృహానికి బయలుదేరుతారు. అల్పాహారం తీసుకుని, 7.35 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు తిరుగుప్రయాణమవుతారు.
- 9గంటలకు రేణిగుంట నుంచి విమానంలో కర్నూల్ జిల్లా ఓర్వకల్లుకు బయలుదేరుతారు.

**నగరానికి మణిహారం**

**తిరుపతి తుడా :** తిరుపతికి మణిహారం శ్రీనివాస సేతును ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించనున్నట్లు స్మార్ట్‌సిటీ ఎండీ హరిత తెలిపారు.

### సమన్వయంతో పనిచేయాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఈమేరకు సీఎం పర్యటించనున్న ప్రాంతాలను తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరితతో కలిసి ఆయన సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టంగా భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, డీపీఆర్‌ఓ బాల కొండయ్య, గంగమ్మ గుడి చైర్మన్ గోపీయాదవ్, ఈఓ ముని కృష్ణయ్య, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.



సభా వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

## ఆధ్యాత్మిక సొబగులతో అభివృద్ధి



మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మించిన అన్నమయ్య మార్గం

- తిరుపతిలో సువిశాలంగా రహదారుల నిర్మాణం
- మహనీయుల మార్గాలుగా నామకరణం
- ప్రధాన కూడళ్లలో చారిత్రక వైభవం

**తిరుపతి తుడా :** ఆధ్యాత్మిక క్షేత్రం తిరునగరిలో అభివృద్ధి సరికొత్త సొబగులద్దుకుంటోంది. సువిశాలమైన రహదారులతో అలరారుతోంది. చారిత్రక ఘట్టాలను చాటేలా విరాజిల్లుతోంది. మహనీయులను స్మరించుకునే మార్గాలతో ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రధాన కూడళ్లు సైతం దేవతామూర్తులు.. సప్తగిరులు.. శ్రీవారి వైభవాన్ని ఆవిష్కరించే చిత్రాలతో కనువిందు చేస్తోంది. అలాగే ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లో నెలకొల్పిన దండి మార్చ్ .. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకం.. మాస్టర్ ప్లాన్ రోడ్లకు అలంకరించి త్రివర్ణ శోభ.. ప్రతి మదిలో దేశభక్తిని ఇనుమడింపజేస్తోంది.

**కొత్త రోడ్లు.. పేర్లు**

- రాణి పరాంతకా దేవి మార్గం (రేణిగుంట రోడ్డు లోని హీరో హోండా షోరూమ్ తూర్పు వైపు నుంచి దక్షిణ దిశగా మున్సిపల్ కార్పొరేషన్ సరిహద్దు వరకు 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు). తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వందల ఏళ్ల క్రితమే విలువైన కానుకలు సమర్పించిన మహా భక్తురాలు.
- కులశేఖర ఆళ్వార్ మార్గం (రేణిగుంట రోడ్డు హీరో హోండా షోరూమ్ ఎదురుగా కొంక చెన్నాయగుంట-తిమ్మినాయుడుపాళెం వరకు ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ 100 అడుగుల రోడ్డు). 12 మంది ఆళ్వారుల్లో ఈయన ఒకరు. కలిశకం 28లో చౌర సామ్రాజ్యాన్ని పాలించిన ప్రభువు. తిరుమల శ్రీవారికి మహా భక్తుడు.
- గోదాదేవి మార్గం (తిమ్మనాయుడుపాళెం కాటన్ మిల్లు నుంచి కరకంబాడి వరకు 80 అడుగుల రోడ్డు). తిరుమల శ్రీవారికి తన పాశురాల ద్వారా సేవ చేశారు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువును వివాహమాడిన భక్తురాలు.
- తిరుప్పావై మార్గం (కరకంబాడి రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి కొత్తపల్లి ఎల్‌షేప్ రహదారిని కలిపే 40 అడుగుల రోడ్డు). మహా విష్ణువును కీర్తిస్తూ గోదాదేవి రాసిన గీతమాలిక తిరుప్పావై, తిరుమల ఆలయంలో ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠిస్తారు.
- ఘట్టి దేవరాయ మార్గం (రేణిగుంట మెయిన్ రోడ్డు నుంచి ఆటో నగర్ మీదుగా అంబేద్కర్ కాలనీ వరకు 40 అడుగుల రోడ్డు). 1130 ఫిబ్రవరి 23వ తేదీను రామానుజాచార్యుల వారితో తిరుపతి నగర నిర్మాణానికి శంకుస్థాపన చేయించిన మహనీయుడు.
- వీర నరసింగయాదవ రాయ మార్గం (తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్ నుంచి 40 అడుగుల రోడ్డు). 1252లో తిరుమల శ్రీవారి ఆలయ గోపుర నిర్మాణం చేయించారు. ఆనంద నిలయం కట్టించి, తొలిసారి బంగారు పూత వేయించిన పరమ భక్తుడు. యాదవరాజు.
- అనంతాళ్వార్ మార్గం (రేణిగుంట రోడ్డులోని అంకుర ఆస్పత్రికి తూర్పు నుంచి దక్షిణం వైపు కార్పొరేషన్ సరిహద్దు వరకు ఉన్న 60 అడుగుల రోడ్డు). తిరుమలలో పూల తోటలు పెంచి శ్రీవారికి పుష్పకైంకర్యం చేసిన పరమ భక్తుడు.
- నమ్మాళ్వారు మార్గం(గెస్ట్‌లైన్ డేస్ పక్కన అన్నమయ్య మార్గం నుంచి శెట్టిపల్లె వరకు వేస్తున్న 80 అడుగుల రోడ్డు) విష్ణు తత్వ ప్రచారకుల్లో ప్రముఖు లు. విష్వక్సేనుడి అవతారంగా భక్తులు భావిస్తారు.
- జగద్గురు రామానుజాచార్య మార్గం (రామానుజ కూడలి నుంచి నంది సర్కిల్ వరకు). శ్రీవారి ఆలయంలో పూజా విధానాలను స్థిర పరచిన హిందూ ధర్మ ప్రచారకుడు. నడిచే దైవం.
- శ్రీకృష్ణదేవరాయ మార్గం (లీలా మహల్ సర్కిల్ నుంచి కరకంబాడి రోడ్డులో కార్పొరేషన్ సరిహద్దు వరకు). శ్రీవారికి అమూల్య కానుకలు, మాన్యాలను కానుకగా సమర్పించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి.మహాభక్తుడు.



తిరుప్పావై మార్గాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్

- పెరియాళ్వార్ మార్గం (మున్సిపల్ ఆఫీస్ నుంచి లీలా మహల్ సర్కిల్ వరకు ఉన్న రోడ్డు) 12 మంది ఆళ్వారుల్లో ఒకరు.ఆళ్వారుల శ్లోకాలను దివ్య ప్రబంధంగా సంకలనం చేసిన వైష్ణవ తత్వ ప్రచారకులు.
- తరిగొండ వెంగమాంబ మార్గం (ఎమ్మార్ పల్లె సర్కిల్ నుంచి సంగీత కళాశాల వరకు ఉన్న రోడ్డు). తిరుమల శ్రీ వారిని తన కీర్తనలతో స్తుతించిన మహా భక్తురాలు.
- తిరుమల నంబి మార్గం (కరకంబాడి రోడ్డు నుంచి మానస సరోవర్ హోటల్ వరకు 40 అడుగుల రోడ్డు). తిరుమలలో పూల తోటలు పెంచి శ్రీవారికి ప్రతి రోజు పుష్ప కైంకర్యం చేసిన గొప్ప భక్తుడు.
- అన్నమయ్య మార్గం (గెస్ట్ లైన్ డేస్ నుంచి రేణిగుంట రోడ్డు లోని రైల్వే గేట్ వరకు ఉన్న రోడ్డు). తిరుమల శ్రీవారిని తన సంకీర్తనలతో సేవించిన మహా భక్తుడు.తొలి తెలుగు వాగ్గేయ కారుడు.
- పురందరదాసు మార్గం (టౌన్ క్లబ్ సర్కిల్ నుంచి గరుడ సర్కిల్ దాకా ఉన్న రోడ్డు). శ్రీవారిని తన కీర్తనలతో సేవించిన మహా భక్తుడు.
- శ్రీశ్రీశ్రీ పరమాచార్య చంద్రశేఖర సరస్వతి మార్గం (రేణిగుంట రోడ్డులోని భార్గవి టైల్స్ పక్కగా దక్షిణం వైపు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వరకు నిర్మించిన 80 అడుగుల రోడ్డు). కంచి కామకోటి పీఠాధిపతుల్లో ఒకరు. నడిచే దైవంగా భక్తులు కొలిచే హిందూ ధర్మ ప్రచారకులు.
- శ్రీమతి పంగులూరి సీతమ్మ మార్గం (ఎమ్మార్‌పల్లె నుంచి మహిళా వర్సిటీ వరకు నిర్మించిన 80 అడుగుల రోడ్డు). శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి పూర్వమే సుమారు 100 ఎకరాలు దానంగా అందించిన ఉత్తమురాలు.

## పర్యవేక్షిస్తూ..అంకురాలకు బీజం వేస్తూ!



తిరుమల మాడవీధుల్లో ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు

- శాస్త్రోక్తంగా తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించిన సేనాధిపతి

**తిరుమల:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. స్వామి వారి సర్వసేనాధిపతి విష్వక్సేనుడు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మాడ వీధుల్లో కలితిరిగారు. వైఖానస ఆగమశాస్త్ర బద్ధంగా ఈ వేడుక నిర్వహించారు. యాగశాలలో లలాట, బహు, స్తన పునీత ప్రదేశంలో భూమి పూజ (మత్సంగ్రహణం) నిర్వహించారు. తొమ్మిది పాళికల్లో (కుండలు) తొమ్మిది రకాల నవధాన్యాలతో అంకురార్పణం (బీజావాపం) చేశారు. అంకురాలను ఆరోపించే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయం. అనంతరం రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో మాజీ రాష్ట్రపతి



ఆలయం వెలుపల మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

**తిరుచానూరు(చంద్రగిరి) :** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ వద్ద ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఏఈఓ రమేష్ స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, డీఎస్పీ నంద కిషోర్ పాల్గొన్నారు.

### ఘనంగా వరాహస్వామి జయంతి

**తిరుమల :** తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం వరాహ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం కలశ స్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేశారు. విశేష అభిషేకాలు జరిపించారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో నెమలి ఈకల వినాయకుడు



తుమ్మలగుంటలో కొలువుదీరిన రాష్ట్రంలోనే అతిపెద్ద నెమలి ఈకల వినాయకుడు

- 34 అడుగుల ఎత్తు.. 15 అడుగుల వెడల్పు
- విగ్రహ తయారీలో 10 వేల నెమలి ఈకలు
- 25 రోజుల పాటు శ్రమించిన సినీ కార్మికులు
- నేడు తొలి పూజ చేయనున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన

**తిరుపతి రూరల్:** రాష్ట్రంలోనే అతిపెద్ద నెమలి ఈకల వినాయకుడు తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో కొలువుదీరాడు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏటా వినాయకచవితి వేడుకలను వినూత్నంగా, భారీగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వారి ఆధ్వర్యంలో తుమ్మలగుంట బాల వినాయక కమిటీ 10 వేల నెమలి ఈకలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. 34 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో తీర్చిదిద్దిన ఈ విగ్రహాన్ని హైదరాబాదు, చెన్నైకి చెందిన 50 మంది సినీ ఆర్ట్ కళాకారులు 25 రోజుల పాటు తయారు చేశారు. విగ్రహ మండపాన్ని రాజమందిరంలా రూపొందించారు. ఈ క్రమంలో సోమవారం వినాయక చవితి సందర్భంగా ఉదయం 10 గంటలకు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తొలి పూజ నిర్వహించనున్నట్లు తుడా చైర్మన్, బాల వినాయక కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. 7 రోజుల పాటు చవితి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత పదేళ్లుగా.. తుమ్మలగుంటలో గణపతిని కొలువుదీర్చడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

## ఇంటింటికీ మట్టి గణపతి

- చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష ప్రతిమల పంపిణీ
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విగ్రహాల తయారీ
- ప్రజలు మెచ్చిన నేత ఎమ్మెల్యే చెవిరెడ్డి అంటూ కలెక్టర్ ప్రశంసలు
- ప్రకృతి హితమే పండుగల పరమార్థమన్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ సభ్యులకు మట్టి గణపతి ప్రతిమలు అందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి



కలెక్టర్‌కు వినాయక ప్రతిమను అందిస్తున్న తుడా చైర్మన్

**తిరుపతి రూరల్ :** పండుగలు, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సామాజిక బాధ్యతగా చేపట్టారు. ఈ మేరకు చంద్రగిరి నియోజకవర్గంలో వినాయకచవితిని పురస్కరించుకుని ఇంటింటికీ మట్టి గణపతి ప్రతిమల పంపిణీకి శ్రీకారం చుట్టారు. సుమారు లక్ష విగ్రహాలను తయారు చేయించి ప్రజలకు అందజేశారు. ఆదివారం ఈ మేరకు చంద్రగిరిలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీని కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ముందుగా గణనాథునికి పూజలు నిర్వహించి, ప్రతి ఇంటికీ ఉచితంగా విగ్రహాలను అందించే బృహత్ కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జనం మెచ్చిన నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి అని ప్రశంసించారు. ఆధ్యాత్మిక, పర్యావరణ ప్రేమికుడిగా ఆయన సేవలు అద్భుతమని కొనియాడారు. లక్షలాది కుటుంబాలకు మట్టి గణపయ్య విగ్రహాలను ఉచితంగా అందించడం చాలా గొప్ప విషయమన్నారు. దైవ భక్తి ఎంత ముఖ్యమో.. పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అలాగే యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు భారీ విగ్రహాలను సైతం అందజేయడం విశేషమని చెప్పారు. నీటిలో సులువుగా కరిగిపోయే విధంగా తయారు చేసిన 1,060 పెద్ద ప్రతిమలను టీటీడీ ఈఓ చేతుల మీదుగా పల్లెపల్లెకు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

**ప్రకృతి హితంగా పండుగ**

ప్రకృతి హితమే పండుగల పరమార్థమని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ముందుగా చంద్రగిరి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. మనం జాగ్రత్తగా గమనిస్తే.. ప్రతి పండగ వెనకా ఓ మహోన్నత లక్ష్యం కనిపిస్తుందన్నారు. ప్రకృతి శక్తులను ఆరాధించడం మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వస్తోందన్నారు. మట్టి వినాయక ప్రతిమల పంపిణీని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సుమారు పదేళ్ల క్రితమే ప్రారంభించారని తెలిపారు. పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యమిచ్చే దిశగా ఎమ్మెల్యే అడుగులు వేశారని వెల్లడించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, అందమైన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే చంద్రగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ మట్టి వినాయక ప్రతిమను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రకృతికి, ప్రజలకు, సమాజానికి మంచి చేసే విషయంలో తాము ఎప్పుడూ ముందుంటామని వివరించారు.

# అత్యాధునికంగా 'వసతి'

- ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కార్పొరేట్ హంగులతో హాస్టళ్లు
- రూ.37.8కోట్లతో జీ ప్లస్ ఫైవ్ భవనాలు
- సుమారు 900 మంది విద్యార్థుల సామర్థ్యంతో సదుపాయాలు
- ముఖ్యమంత్రి చేతులమీదుగా నేడే ప్రారంభం


ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనం

**తిరుపతి సిటీ :** తిరుపతి నగరం నాలెడ్జ్ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలో టీటీడీ తమ విద్యాసంస్థల్లో కార్పొరేట్ వసతులు కల్పిస్తోంది. అందులో భాగంగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో అధునిక వసతులతో నూతన హాస్టల్ భవనాలను నిర్మించింది. ప్రస్తుతం కళాశాలలో సుమారు 3వేల మంది విద్యార్థులు ఉన్నారు. అందులో సుమారు 1,900మంది హాస్టళ్లలో వసతి పొందుతున్నారు. ప్రస్తుతం కళాశాల ఆవరణలో ఉన్న హాస్టళ్లలో గదులు ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సువిశాలమైన గదులు, అత్యాధునిక సౌకర్యాలతో టీటీడీ నూతన భవనాలు నిర్మించింది. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ అర్హత మేరకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

**ఆధునికంగా భవనాలు**

సుమారు రూ.37.80కోట్ల వ్యయంతో టీటీడీ ఆధునిక వసతులతో జీ ప్లస్ ఫైవ్ భవనాలను నిర్మించింది. రెండు బ్లాకులుగా ఉన్న ఈ భవనాలలో 181 వసతి గదులు, రెండు విశాలమైన డైనింగ్ హాళ్లను ఏర్పాటు చేసింది. కొత్త భవనాలకు వెంకటాద్రి బ్లాకులుగా నామకరణం చేసింది. సుమారు 900మంది విద్యార్థులకు ఏకకాలంలో వసతి సౌకర్యం పొందేందుకు అవకాశం ఉంది. ఒక్కొక్క డైనింగ్ హాల్‌లో ఒకేసారి 400మంది విద్యార్థులు భోజనం చేసే విధంగా ఏర్పాట్లు చేసింది. అలాగే లిఫ్ట్ సౌకర్యం సైతం కల్పించింది. శుద్ధ జలం అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్ విద్యార్థులకు 2007 నుంచి ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.15కోట్ల వరకు టీటీడీ ఖర్చు చేస్తోంది.

**నేడు ప్రారంభించనున్న సీఎం**

నూతన హాస్టల్ భవనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం ప్రార ంభించనున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి, డీఈఓ ఎం భాస్కర్‌రెడ్డి ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శశికుమార్ మృతదేహం

**చంద్రగిరి :** స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరిలోని భారతీనగర్‌కు చెందిన శశికుమార్ ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి దోర్నకంబాల పంచాయతీలో విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఆదివారం ఉదయం మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. స్తంభం ఎక్కి తీగలు లాగుతుండాద ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ కరెంట్ వైర్ తగలడంతో షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు 108లో చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ సిబ్బంది మృతి చెందడంపై ఏఈ హరిప్రసాద్ విచారం వ్యక్తం చేశారు.

## పాము కాటుకు ఒకరి బలి

**కోట:** మండలంలోని తిమ్మనాయుడుపాళెంలో ఆదివారం పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఓజిలి గ్రామానికి చెందిన రవి(40) ఇటుక బట్టీలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈక్రమరంలో బట్టీ వద్ద నిద్రిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


దేదీప్యంగా కల్యాణ వెంకన్న ఆలయం, సేనాధిపతి ఉత్సవంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి, పూజా సామాగ్రీ తీసుకువస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

- హాజరైన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

**తిరుపతి రూరల్ :** తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు సమర్పించి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను అలంకార మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ, శుద్ధి క్రతువులు ఆగమోక్తంగా చేపట్టారు. అనంతరం విష్వక్సేనులవారిని మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, ఈఓ సుబ్రమణ్యం రెడ్డి, కంకణ భట్టర్ గిరిధర్ భట్టాచార్యులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి:** మండలంలోని రాచగున్నేరి గ్రామానికి చెందిన సుమారు 50 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు తమకు వరంగా మారాయన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత 30 ఏళ్లలో చూడని అభివృద్ధిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆయనను గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**నాయుడుపేటటౌన్ :** మండలంలోని చిగురువాడ వద్ద ఓ వ్యక్తి మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని పాగొట్టం కాలనీకి చెందిన అనూప్‌కుమార్ (35) స్థానికంగా కేబుల్ టీవీలో పనిచేసేవాడు. 15 ఏళ్ల కింద నాయుడుపేటకే చెందిన కంది రూపతో పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనూప్ మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. ఇటీవల భార్యను కత్తితో పొడిచేందుకు యత్నించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో అనూప్ జైలుకు సైతం వెళ్లాడు. విడుదలైన తర్వాత కూడా వేధిస్తుండడంతో రూప తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక అప్పటి నుంచి అనూప్ తన పెంపుడు తల్లి మన్నారు శ్రీదేవి ఇంట్లో ఉండేవాడు. అయితే శనివారం ఉదయం వెళ్లిన అనూప్ తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం మండలంలోని చిగురుపాడు వద్ద పొలాల్లో మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు ఫోన్ చేయడంతో అనూప్ కుటుంబీకులు అక్కడకు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణయ్య ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి, కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైనిక్ క్యాంప్‌కు 24 మంది బాలికలు


ఎంపికైన క్యాడెట్లతో ఎన్‌సీసీ అధికారులు

**తిరుపతి సిటీ:** ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి 24మంది బాలికలు ఎంపికైనట్లు తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ డొంగ్ర కోటి తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌సీసీ నగర్‌లో సైనిక్ క్యాంప్‌కు ఎంపికైన గర్ల్ క్యాడెట్లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 30వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారన్నారు. అందులో ప్రతిభ చూపిన 24 మంది క్యాడెట్లను ఎంపిక చేసి పది వారాలపాటు కఠిన శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. క్యాంప్‌లో చేపట్టే పోటీల్లో విజేతలుగా నిలిచి తెలుగు రాష్ట్రాల పేరు నిలబెట్టాలని సూచించారు. క్యాడెట్లతోపాటు క్యాంప్‌కు లెఫ్టినెంట్ ఆన్‌మేరీ జోఫ్, నాయక్ సుబేదార్ అజిత్ కుమార్‌జా, హవల్దార్ అంకిరెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. బాలికలకు మహ్మద్ షియాజుద్దీన్, జ్ఞానేశ్వర్, వంశీ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

# నేటి నుంచి పెరటాసి మాసం

- శ్రీ వేంకటాచలపతి అవతరించిన మాసం
- శ్రీ వెంకన్నకు శనివారం తలిగలతో భక్తుల పూజలు


శ్రీవారి ఆలయం వెలుపల గోవిందమాలధారులు

**తిరుపతి కల్చరల్:** పన్నెండు మాసాల సమూహాన్ని సంవత్సరం అంటారు. తెలుగు మాసాలు చంద్రమానం ప్రకారం ఉంటే, తమిళ మాసాలు సౌరమానం ప్రకారం లెక్కగడతారు. సూర్యుడు ఉన్న రాశిని బట్టి నెలకు పేరు వస్తుంది. ఈ క్రమంలో ఆరవ నెలను పెరటాసి, పురటాసి, పెరుమాళ్ అనే పేర్లతో పిలుస్తారు. శ్రీమహావిష్ణువు వేంకటాచలపతిగా అవతరించిన మాసమే పెరటాసి అని వేంకటాచలమహత్యం చెబుతోంది.

**పాదయాత్రగా తిరుమలకు..**

పెరటాసి మాసంలో ప్రజలందరూ శ్రీవారికి ప్రీతి పాత్రమైన శనివారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఐదు శనివారాలు పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. తమిళులు ఈనెలలో తప్పనిసరిగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుంటారు. గ్రామీణులు ఊళ్లకు ఊళ్లు కాలినడకన బయల్దేరి తిరుమల బాటపడతారు. ఏడాది పొడవునా సంపాదించిన దాంట్లో కొంతభాగం కూడబెట్టి కానుకలను శ్రీవారికి సమర్పించుకుంటారు. అఖిలాండం వద్ద నేతి పిండి దీపారాధనతో స్వామిని వేడుకుంటారు. గత వెయ్యేళ్లుగా ఈ ఆచారం సాగుతోందని చరిత్ర. పవిత్ర పెరటాసి మాసంలో భక్తులు నియమ నిష్టలతో ఉండాలని స్కంధపురాణం చెబుతోంది. తిరుమలేశుడికి ఈ నెలలోనే స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున ఇది శ్రీవారి తిరునాళ్ల నెలగా పిలుస్తారు. ఈ మాసపు శనివారాల్లో ఉదయాత్పూర్వమే భక్తులు నిద్రలేచి శుచిగా స్నానమాచరించి చక్కెర లేదా బెల్లం కలిపిన బియ్యం వంటకాన్ని భగవంతుడికి నివేదిస్తారు. దీనిని తలిగ అంటారు. ప్రతి భక్తుడు నియమనిష్టలతో ఉండి స్వామివారిని పూజించి ముడుపులను మూటగట్టి స్వామికి సమర్పించుకుంటారు. ఈనెల 18వ తేదీన ఆరంభమయ్యే పెరటాసిలో మొదటి శనివారం 23న మొదలై వచ్చే నెల 21న చివరి శనివారంతో ముగుస్తుంది. ఈ ఏడాది పెరటాసిలో నాలుగు శనివారాలు వస్తున్నాయి. ఇందులో తొలి, మూడో శనివారాలు శ్రేష్టమైనవని తప్పకుండా ఆ వారాలలో తలిగ వేసుకుంటే శుభం జరుగుతుందని ఆచార్య చక్రవర్తి రంగనాథన్‌వివరించారు.

## ప్రభుత్వాల హామీ హర్షణీయం


నూతన కమిటీని అభినందిస్తున్న అతిథులు


**తిరుపతి కల్చరల్ :** హోటల్, రెస్టారెంట్ రంగాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇవ్వడం హర్షణీయమని ఏపీ, తెలంగాణ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరాంజనేయులు(చిల్లీస్ అంజి), కార్యదర్శిగా నితిన్ చక్రవర్తి, కోశాధికారిగా శ్రీహరి, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి హోటల్ యజమానుల సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, డీఆర్ కుమార్‌స్వామిరెడ్డి, కృష్ణభట్, ఎం.వెంకయ్య పాల్గొన్నారు.

# ప్రేమ్‌చంద్ కథల సంపుటి ఆవిష్కరణ


కథావళిని ఆవిష్కరిస్తున్న అతిథులు

**తిరుపతి కల్చరల్:** భారతీయ సాహిత్యంలోనే అభ్యుదయ రచనలకు ముందడుగు మున్షీ ప్రేమ్‌చంద్ అని, ఆయన కథలు, నవలలు ఇతర భాషల్లోకి అనువాదమై నవలా చక్రవర్తిగా కీర్తి గడించారని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షురాలు ఆర్.రాజేశ్వరమ్మ తెలిపారు. బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం ప్రేమ్‌చంద్ కథావళి (వందకథల సంపుటి) ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అనువాద సాహిత్యంతో తెలుగు భాష మరింత పరిపుష్టమవుతుందన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రేమ్ చంద్ కథా సంపుటి ఆనాటి దేశ కాల పరిస్థితులను ఈ తరానికి తెలియజేశాయని తెలిపారు. కథా సంపుటి సంపాదకురాలు ఎంబీ.ప్రత్యూష మాట్లాడుతూ సాహిత్య చైతన్య స్రవంతి కొనసాగించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సాహితీ ప్రముఖులు వి.చెంచయ్య, సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, కథా ప్రపంచం తిరుపతి కిరణ్, రచయితలు పాల్గొన్నారు.

## ఘనంగా సామవేద ఉపాకర్మ


ఉపాకర్మ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

**తిరుపతి సిటీ :** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆదివారం సామవేద విభాగం ఆధ్వర్యంలో సామవేద ఉపాకర్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సామవేద అధ్యయనం చేసి కంకణం ధరించారు. ఆ విభాగాధిపతి గిరిజా ప్రసాద్ మాట్లాడుతూ భాద్రపద మాసం, శుక్లపక్షం, హస్త నక్షత్రం రోజున సామవేద ఉపాకర్మ ఆచరించడం ఆనవాయితీ అన్నారు.

## 'రెప్కో'లో డిపాజిట్‌లపై అధిక వడ్డీ

**తిరుపతి అర్బన్:** రెప్కో బ్యాంక్ భారత సంస్థ వారు అందిస్తున్న సేవలను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంచ్ చీఫ్ మేనేజర్ తెన్నావన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ల స్కీమ్‌లపై అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. రెప్కో బంగారు తల్లి స్కీమ్ ద్వారా 18 ఏళ్ల లోపు పిల్లలకు ప్రత్యేక ఫిక్స్‌డు డిపాజిట్లపై 8.50 శాతం వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. వృద్ధులకు,మహిళలకు ఇతర ప్రత్యేక డిపాజిట్ స్కీమ్‌లు ఉన్నాయని వెల్లడించారు. వివరాలకు తిరుపతిలోని జీకార్ స్ట్రీట్‌లోని తమ బ్యాంక్ సిబ్బందిని సంప్రదించాలని, 0877 2258802, 9490181510 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.




వినాయక చవితిని పురస్కరించుకుని తిరుపతి మరింత సందడిగా మారింది. పూజాసామగ్రి కొనుగోలు చేసుకునే వారితో వీధులు కిక్కిరిసిపోయాయి. వాడవాడలా గణేశ మండపాలు సర్వాంగ సుందరంగా సిద్ధమయ్యాయి. వినాయక ప్రతిమలను తరలించే వాహనాలతో పలు చోట్ల ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తాయి. కొనుగోలుదారులతో ముఖ్యంగా గాంధీ రోడ్డు, మార్కెట్‌రోడ్డు, బైరాగిపట్టెడ, ఆర్‌సీ రోడ్డు, అన్నారావు సర్కిల్, బాలాజీ కాలనీ, ఐఎస్ మహల్ రోడ్డు, సత్యనారాయణపురం సర్కిల్ వంటి ప్రధాన వీధులు జన సంద్రాన్ని తలపించాయి. - తిరుపతి కల్చరల్